క్లుప్తంగా

ఉపాధి పనుల పరిశీలన



బాల్కొండ: జలాల్‌పూర్‌లో ఉపాధి హామీ పనులను బాల్కొండ ఏపీవో ఇందిరా పరిశీలించారు. కూలీల సంఖ్య పెంచాలని సూచించారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పని చేసే చోట నీటిని, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలన్నారు. టీఏ ధనుంజయ్, ఎఫ్ఏ అనిల్, సిబ్బంది పాల్గొన్నారు.

అవార్డు అందజేత



ఆర్మూర్‌టౌన్: హైదరాబాద్‌లోని కేవీఆర్ కన్వెన్షన్‌లో లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ 320–డి ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ గ్రీన్ వ్యవస్థాపక అధ్యక్షుడు గుజరాతి నివేదన్‌కు 320–డి జిల్లా లయన్స్ క్లబ్ గవర్నర్ లక్ష్మి చేతుల మీదుగా ప్రశంస పత్రం, అవార్డు అందజేశారు. ఇటీవలే ఇంటర్నేషనల్ లయన్స్ క్లబ్‌కు 1000 డాలర్లు విరాళంగా ఇచ్చినందుకు ప్రశంసా పత్రం, అవార్డు ప్రదానం చేసి అభినందించారు. కార్యక్రమంలో లయన్స్‌గ్రీన్ అధ్యక్షుడు జెంటిల్ కిడ్స్ ప్రకాష్, కార్యదర్శి రాజేష్, కోశాధికారి కుంటాల నరేందర్, ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆలయానికి భూదానం



పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ మండల కేంద్రంలో ముత్యాలమ్మ గుడి ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న చిలుకల చిన్నమ్మ గుడి నిర్మాణం కోసం మునిపల్లి గ్రామానికి చెందిన దాతలు బాయి లింబన్న, ఆర్మూర్‌కు చెందిన మగ్గిడి రాజేశ్వర్, సాదుల శ్రీనివాస్ భూమిని విరాళంగా అందజేశారు. ఆలయ నిర్మాణానికి భూమి లేకపోవడంతో వీడీసీ సభ్యుల విన్నపం మేరకు దాతలు 500 గజాల భూమిని విరాళంగా అందజేశారు. దీంతో వీడీసీ సభ్యులు దాతలను సోమవారం ఘనంగా సన్మానించారు.

ఓబీసీ మోర్చా మండల ఉపాధ్యక్షుడిగా గంగాధర్



మాక్లూర్: ఓబీసీ ఆలూర్ మండల ఉపాధ్యక్షుడిగా కల్లెడి గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ ఇసాపల్లి గంగాధర్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ మండల అధ్యక్షుడు కొత్తూర్ గంగాధర్(అలియాస్) గిరిష్ చేతుల మీదుగా సోమవారం ఇసాపల్లి గంగాధర్ నియమాకపు పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి ఉపాధ్యక్ష పదవి ఇప్పించిన పార్టీలోని సీనియర్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఓబీసీలను ఐక్యం చేసి జరుగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ పార్లమెంట్ అభ్యర్థి ధర్మపురి అర్వింద్ గెలుపునకు కృషి చేస్తానని అన్నారు. మండల ఓబీసీ అధ్యక్షుడు నడిసరం మల్లయ్య పాల్గొన్నారు.

టీడీపీ వాణిజ్య శాఖ రాష్ట్ర కార్యదర్శిగా..

వేల్పూర్: లక్కోర గ్రామానికి చెందిన గోవర్ధన్ గౌడ్ టీడీపీ వాణిజ్యశాఖ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైనట్లు సోమవారం తెలిపారు. టీడీపీ తెలంగాణ రాష్ట్ర వాణిజ్య విభాగం అధ్యక్షుడు వెలివెల దుర్గారావు తనను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు పేర్కొన్నారు.

బాల్యవివాహాలను అరికట్టేందుకు సహకరించాలి

మోపాల్(నిజామాబాద్‌రూరల్): బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని, జిల్లా బాలల పరిరక్షణ అధికారి చైతన్య కుమార్ సూచించారు. మండలంలోని కులాస్‌పూర్ తండాలో సోమవారం జిల్లా బాలల పరిరక్షణ, పోలీస్‌శాఖ సంయుక్త ఆధ్వర్యంలో బాల్య వివాహ నిరోధక చట్టం, గర్భస్థ లింగ నిర్ధారణ నిరోధక చట్టం, 1098 చైల్డ్ టోల్ ఫ్రీ నెంబర్‌పై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా ప్రొజెక్టర్ ఏర్పాటు చేసి, గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అనంతరం చైతన్యకుమార్ మాట్లాడుతూ.. గ్రామాల్లో ఎవరైనా బాల్యవివాహం చేస్తే వెంటనే పోలీసులకు, తమకు ఫోన్ చేయాలని, వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. ఏఎస్సై రమేష్ కుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జకీరా, పంచాయతీ కార్యదర్శి చైతన్యకుమార్, చైల్డ్ హెల్ప్‌లైన్ కో–ఆర్డినేటర్ జ్యోత్స్న, అంగన్‌వాడీ టీచర్లు, పోలీస్, చైల్డ్ లైన్ సిబ్బంది పాల్గొన్నారు.

‘డబుల్’ నిర్లక్ష్యం..!

- మెండోరాలో ఏడేళ్ల క్రితం ప్రారంభమైన డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలు
- ఆరు నెలలుగా ముందుకు సాగని పనులు
- ఆందోళనలో లబ్ధిదారులు

బాల్కొండ: మెండోరా మండల కేంద్రంలో నిర్మిస్తున్న డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఫలితంగా పనులు మొదలై ఏడేళ్లు గడుస్తున్నా ఇప్పటికి అసంపూర్తిగానే ఉన్నాయి. ముందు నిర్మించిన ఇళ్లు శిథిలావస్థకు చేరుతున్నాయి. కాని ఇప్పటికీ పూర్తి కాలేదు. అసలు పూర్తి చేస్తారో లేదో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో లబ్ధిదారులు, ఆశావహులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మెండోరా మండల కేంద్రంలో 60 డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణానికి గత ప్రభుత్వం రూ.3.77 కోట్ల నిధులను 2017లో మంజూరు చేసింది. అదే సంవత్సరం పనులు ప్రారంభించింది. కాని ఇప్పటికీ పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయి. చేపడుతున్న పనుల్లో కూడా నాణ్యతా ప్రమాణాలు పాటించక పోవడం వల్ల గోడలు పగుళ్లు ఏర్పడి కూలిపోయే పరిస్థితికి వచ్చింది. అయినా అధికారులు అటు వైపు కన్నెత్తి చూడటం లేదు.

త్వరలో ప్రారంభిస్తాం..

డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణ పనులను త్వరలోనే ప్రారంభిస్తాం. కూలీల కొరత ఉండటంతో కాంట్రాక్టర్ పనులను నిలిపి వేశాడు. బిల్లుల చెల్లింపులో ఎలాంటి ఇబ్బంది లేదు. త్వరగా పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం.

– వినీత్, ఆర్అండ్‌బీ ఏఈఈ, బాల్కొండ



మెండోరా మండల కేంద్రంలో అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూం ఇళ్లు

ఆరు నెలలుగా సాగని పనులు..

మెండోరా మండల కేంద్రంలో నిర్మిస్తున్న డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణ పనులు ఆరు నెలలుగా ముందుకు సాగడం లేదు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇళ్ల నిర్మాణ పనులను నిలిపేశారు. అప్పటి నుంచి పనులు ముందుకు సాగడం లేదు. ఎన్నికలకు ముందు అసంపూర్తిగా ఉన్న ఇళ్లనే లబ్ధిదారులకు కేటాయించి చేతులు దులుపుకుందామని పాలకులు యత్నాలు చేశారు. కానీ లబ్ధిదారులు అలా తీసుకోవడానికి ముందుకు రాకపోవడంతో అలానే ఉండిపోయాయి. ఆరు నెలలుగా పనులు ముందుకు సాగకున్నా కాంట్రాక్టర్‌పై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. బిల్లులు చెల్లింపులో ఏదైనా సమస్య ఉందంటే అదీ లేదని అధికారులే అంటున్నారు. అలాంటప్పుడు పనులు ఆరు నెలలుగా ముందుకు సాగకుంటే అధికారులు ఎందుకు చర్యలు చేపట్టడం లేదు. అధికారుల నిర్లక్ష్యం లబ్ధిదారులకు శాపమవుతోంది. ఆర్అండ్‌బీ ఉన్నతాధికారులతో పలుమార్లు ఫోన్‌లో సంప్రందించినా ఎలాంటి స్పందన ఇవ్వడం లేదు. అధికారులు నిర్లక్ష్యం వీడి పనులు ముందుకు సాగేలా చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు వేడుకుంటున్నారు.

నరేంద్ర మోదీతోనే దేశాభివృద్ధి

రుద్రూర్: ప్రధాని నరేంద్ర మోదీతోనే దేశాభివృద్ధి జరుగుతుందని, సంక్షేమ పథకాలు అర్హులకు అందుతాయని బీజేపీ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్ అన్నారు. చందూర్ మండల కేంద్రంలో సోమవారం బీజేపీ బూత్ స్థాయి కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి ప్రజల్లో విస్తృత ప్రచారం కల్పించాలని కోరారు. అనంతరం వివిధ పార్టీలకు చెందిన 150 మంది కార్యకర్తలు బీజేపీలో చేరారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ, మండల బీజేపీ అధ్యక్షుడు విఠల్, నాయకులు నర్సింలు, సాయరెడ్డి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



చందూర్‌లో బీజేపీలో చేరిన కార్యకర్తలతో బీబీ పాటిల్

బీజేపీలో భారీ చేరికలు

మాక్లూర్: లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా సోమవారం గొట్టిముక్కల గ్రామంలోని కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన కార్యకర్తలు, నాయకులు 50 మంది బీజేపీలో చేరారు. ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు నేమూరి నర్సాగౌడ్ నేతృత్వంలో అంకాపూర్‌లోని ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి నివాసానికి వెళ్లి పార్టీలో చేరారు. పైడి రాకేష్‌రెడ్డి బీజేపీ కండువాలను కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎంపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్ గెలుపే లక్ష్యంగా పని చేస్తామన్నారు.



బీజేపీలో చేరుతున్న బీఆర్ఎస్ నాయకులు

మాజీ ఎంపీటీసీ జి గంగాధర్, మండల బీజేపీ నాయకులు గంగోనే సంతోష్, పార్టీ మండల అధ్యక్షుడు సురేష్‌నాయక్, ముప్ప గంగారెడ్డి, సీహెచ్ కొండూర్ ఎంపీటీసీ రాజులు ఉన్నారు.

ఆధ్యాత్మికం..

వైభవంగా ఆలయ శిఖర ప్రతిష్ఠాపన



బోధన్‌రూరల్(బోధన్): సాలూర మండల కేంద్రంలోని ఒంటి హనుమాన్ ఆలయంలో శిఖర ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు, గ్రామస్తులకు అన్నదానం ఏర్పాటు చేసి అన్న ప్రసాదాలను వితరణ చేశారు. ఎంపీపీ బుద్దె సావిత్రి, అల్లె జనార్దన్, స్వామిగౌడ్, రాజాగౌడ్, పాండు, వేద పండితులు తదితరులు పాల్గొన్నారు.

ఎరాజ్‌పల్లిలో గంగమ్మ విగ్రహాల ఊరేగింపు



బోధన్‌రూరల్(బోధన్): బోధన్ మండలం ఎరాజ్‌పల్లిలో గ్రామస్తులు, బోయి కులస్తులు గంగమ్మ తల్లి విగ్రహాలను ఊరేగించారు. నేడు విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం పురస్కరించుకుని సోమవారం గ్రామంలో గంగమ్మ తల్లి విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి ఊరేగింపు నిర్వహించారు. ఊరేగింపుగా తీసుకువెళ్లిన విగ్రహాలను గ్రామంలోని దుర్గామాత షెడ్ వద్ద ధాన్యంలో ఉంచారు. విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి గ్రామస్తులు, భక్తులు భారీ సంఖ్యలో తరలిరావాలని కోరారు.

వైభవంగా శ్రీరామ నవమి ఉత్సవాలు ప్రారంభం



బాల్కొండ: బాల్కొండ మండలం కిసాన్‌నగర్, మెండోరా మండలం పోచంపాడ్, ముప్కాల్ మండలం రెంజర్లలోని కోదండ రామాలయాల్లో సోమవారం శ్రీరామ నవమి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భజన కీర్తనలతో ఆలయ ప్రాంగణం మారు మ్రోగింది. మంగళవారం గరుడ వాహన సేవ నిర్వహిస్తామని భక్తులు తెలిపారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు

ఆర్మూర్‌టౌన్ : పట్టణంలోని నవనాథ సిద్దుల గుట్టపై గల శివాలయానికి సోమవారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులు శివాలయంలో పంచా మృతాలతో అభిషేకం నిర్వహించారు. అలాగే ఇతర ఆలయాలను దర్శించుకుని పూజలు చేశారు. నందీశ్వర మహారాజ్ ఆధ్వర్యంలో స్వామివారి ఉత్సవ విగ్రహాలకు పల్లకిసేవ నిర్వహించారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

నందిపేట్(ఆర్మూర్): కాంగ్రెస్ పార్టీతోనే దేశంలో అభివృద్ధి సాధ్యమవుతుందని ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పొద్దుటూరి వినయ్ రెడ్డి అన్నారు. సోమవారం నందిపేట మండల కేంద్రంలోని చింరాజ్‌పల్లి, తల్వేద లక్కంపల్లి గ్రామాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తాటిపర్తి జీవన్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. రైతులు, ప్రజల కష్టాలు తెలిసిన నాయకుడని కొనియాడారు. తెలంగాణాలో ప్రకటించిన ఆరు పథకాలలో నాలుగు పథకాలు ఇప్పటికే అమలు అవుతున్నాయని, మిగతా రెండు త్వరలో అమలు చేస్తామన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు మంద మహిపాల్, ఎంపీటీసీ శ్రీనివాస్, మాజీ సర్పంచులు గణేష్, డీసీసీ ఉపాధ్యక్షులు పెంట ఇంద్రుడు, దేగాం గంగారెడ్డి, సొసైటీ చైర్మన్ బొంకం గంగారెడ్డి పాల్గొన్నారు.



కూలీలతో మాట్లాడుతున్న వినయ్‌రెడ్డి

గుండెపోటుతో ఉపాధ్యాయురాలి మృతి



నవీపేట: మండల కేంద్రంలోని టీఎస్ ఆదర్శ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయురాలు జరీన ఫిర్దోస్(48) గుండెపోటుతో మృతి చెందినట్లు తోటి ఉపాధ్యాయులు సోమవారం తెలిపారు. ఇటీవల తీవ్ర అనారోగ్యంతో బాధపడగా కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. చికిత్స పొందుతూ సోమవా రం గుండెపోటుతో మృతి చెందారన్నారు. మృతు రాలికి భర్త, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

విద్యార్థినికి ఘన సన్మానం



బోధన్‌రూరల్(బోధన్): ఎరాజ్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని ఆర్.సమత ఇటీవల విడుదలైన నవోదయ ఫలితాలలో ప్రవేశానికి అర్హత సాధించింది. దీంతో సోమవారం పాఠశాల ఉపాధ్యాయ బృందం విద్యార్థిని ఆర్.సమత, ఆమె తల్లిదండ్రులను ఉపాధ్యాయులు శాలువా, పూలదండలతో ఘనంగా సన్మానం చేశారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు సమతను ఆదర్శంగా తీసుకొని చదువుపై శ్రద్ధ వహించాలని సూచించారు. గ్రామస్తులు నరేందర్ గౌడ్, నంద గోపాల్, ఉపాధ్యాయులు, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు కాంగ్రెస్ కట్టుబడి ఉంది

ఆర్మూర్‌టౌన్: ఎస్సీ వర్గీకరణకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, రానున్న లోక్‌సభ ఎన్నికల్లో మాదిగలు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని మాదిగ సంఘాల యునైటెడ్ ఫ్రంట్ అధ్యక్షుడు కొక్కెర భూమన్న పిలుపునిచ్చారు. ఆర్మూర్ పట్టణంలోని జర్నలిస్టు కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవలే ప్రధాని లక్షల మంది మాదిగల మధ్య వర్గీకరణ చేస్తామని ప్రకటించి, కమిటీ పేరున కాలయాపన చేస్తున్నారని అన్నారు. బీజేపీ పాలిస్తున్న రాష్ట్రాల్లో దళితులపై దాడులు, అత్యాచారాలు, హత్యలు చేస్తున్నప్పటికి బీజేపీకి మద్దతు ఇచ్చే మాదిగ నాయకులకు ఇవి ఏమీ కనిపించటం లేదా అని ప్రశ్నించారు. నేతలు ఎల్‌టీ కమార స్వామి, కూరగాయల స్వామి, మేతరి సాయన్న, గంగన్న పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కొక్కెర భూమన్న

మద్యం బాటిళ్ల స్వాధీనం

రుద్రూర్: వర్ని మండలం శ్యాంరావ్ తండాలోని ఒక కిరాణ షాపులో అక్రమంగా నిల్వ ఉంచిన నాలుగు లీటర్ల మద్యం బాటిళ్లను సోమవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మద్యం విలువ రూ.4,785 ఉంటుందని వారు పేర్కొన్నారు. కేసు నమోదు చేశామన్నారు. దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై కృష్ణకుమార్ తెలిపారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

బోధన్‌టౌన్(బోధన్): అగ్ని ప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని అగ్నిమాపక కేంద్రం అధికారి గంగాదాస్ సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా సోమవారం పట్టణంలోని ఆర్టీసీ డిపో, బస్టాండ్, రైల్వే స్టేషన్‌లలో అవగాహన సదస్సులు నిర్వహించారు. ఆర్టీసీ డిపోలోని ఉద్యోగులకు, ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులకు, రైల్వే స్టేషన్‌లో సిబ్బందికి అగ్ని ప్రమాదాలు చోటు చేసుకోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, జరిగినప్పుడు తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. అనంతరం కరపత్రాలను పంపిణీ చేశారు. సిబ్బంది శ్రీనివాస్, నర్సయ్య, వారిస్ అహ్మద్, రషీద్, సాయిలు, రాజశేఖర్, మోసిన్ ఖాన్ ఉన్నారు.

ఆర్మూర్ పట్టణంలో..

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంతో పాటు పెర్కిట్ చౌరస్తా వద్ద జాతీయ అగ్నిమాపక దినోత్సవం సందర్భంగా ఆస్పత్రులు, బస్టాండ్లు, ప్రధాన చౌరస్తాల వద్ద మాక్ డ్రిల్ నిర్వహించినట్లు అగ్నిమాపక శాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి తెలిపారు. అగ్నిప్రమాదాలు జరగకుండా ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తూ కరపత్రాలను అందజేశారు.



బోధన్ ఆర్టీసీ డిపోలో అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక శాఖ కేంద్ర అధికారి

నందిపేటలో..

నందిపేట్(ఆర్మూర్): మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంగణంలో వివేకానంద చౌరస్తా వద్ద సోమవారం అగ్నిమాపక సిబ్బంది తమ సేవలను వివరిస్తూ ప్రదర్శనలు చేశారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవలసిన జాగ్రత్తల గురించి తెలిపారు. కార్యక్రమంలో నందిపేట ఫైర్‌స్టేషన్ ఫైర్‌మెన్లు మధుకర్, సుధాకర్, సూరజ్, డ్రైవర్ ఎండీ షఫీ, హోంగార్డు పి.రఘు, తదితరులున్నారు.

బాల్కొండలో..

బాల్కొండ: మండల కేంద్రంలో స్థానిక ఫైర్ స్టేషన్ ఆధ్వర్యంలో అగ్ని మాపక వారోత్సవాలు రెండో రోజు సోమవారం కొనసాగాయి. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ శేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.



ఆర్మూర్‌లో మాక్‌డ్రిల్



నందిపేటలో ..



బాల్కొండలో ..

ఓటరు అవగాహన కార్యక్రమం



కమ్మర్‌పల్లిలో ఓటరు ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

కమ్మర్‌పల్లి: మండలంలో రెవెన్యూ, పంచాయతీ, ఐకేపీ అధికారులు సోమవారం ఓటరు అవగాహన కార్యక్రమం చేపట్టారు. గ్రామ పంచాయతీల్లో అధికారులు ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. పాఠశాలల్లో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. తహసీల్దార్ ఆంజనేయులు, ఎంపీడీవో రాజశ్రీనివాస్, ఐకేపీ ఏపీఎం కుంట గంగాధర్, డీటీ సరిత, ఆర్ఐ శరత్, జీపీ కార్యదర్శి శాంతికుమార్ పాల్గొన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లీష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 – మైదాన్ (హిందీ)- 10.00, 10.25, లవ్‌గురు (తెలుగు)-01.50 శ్రీరంగనీతులు -7.40 గాడ్జిల్లా ఎక్స్ కాంగ్(3డీ-తెలుగు)-5.00

స్క్రీన్-2 – టిల్లు స్క్వేర్ (తెలుగు) – 10.00, 4.25, 10.50 ది ఫ్యామిలీ స్టార్ -01.00, 7.25

స్క్రీన్-3 – బడేమియా చోటే మియా (తెలుగు)- 11.50, 6.30, గీతాంజలి మళ్లీ వచ్చింది – 3.25, 10.05

స్క్రీన్-4 – గీతాంజలి మళ్లీ వచ్చింది – 10.15, మంజుమ్మల్ బాయ్స్ (తెలుగు)- 1.20, 10.35 లవ్‌గురు-04.15, 7.25

ఈఈ క్వార్టర్ కూల్చివేత

సాక్షి ఎఫెక్ట్..

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ కాలనీలో ప్రభుత్వం కేటాయించిన ప్రాజెక్ట్ ఈఈ క్వార్టర్ ఖాళీగా ఉండటంతో కొందరు కబ్జా చేయటానికి యత్నించడంపై సాక్షి దిన పత్రికలో ఆదివారం ‘ఖాళీ కనిపిస్తే కబ్జా’ అనే శీర్షికన వార్తా కథనం ప్రచురించింది. దీంతో స్పందించిన అధికారులు ఉన్నత అధికారుల ఆదేశాలతో కబ్జా చేయుటకు యత్నించిన ఈఈ క్వార్టర్‌ను సోమవారం కూల్చి వేశారు. ప్రభుత్వ క్వార్టర్లు కాలం చెల్లినవిగా ఇది వరకే ఆర్అండ్‌బీ అధికారులు ధ్రువీకరించడంతో కూల్చి వేసినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. దీంతో పాటు ఇరిగేషన్ స్థలంలో నిర్మించిన ఇంటి పునాదిని కూడా కూల దోశారు. ప్రభుత్వ భూములు, క్వార్టర్లను కబ్జా చేస్తే చర్యలు తీసుకుంటామని ప్రాజెక్ట్ అధికారులు హెచ్చరించారు.



ఉపాధి కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



నందిపేట్(ఆర్మూర్): ఉపాధి హామీ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం ప్రజాపంథా ఆధ్వర్యంలో ఎంపీడీవో శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. ఉపాధి చట్టం–2005 ప్రకారం కూలీలకు ఇచ్చిన హక్కులను కల్పించాలన్నారు. 2005లో పార, గడ్డపారలు ఇచ్చారని, తర్వాత ఇవ్వడం లేదన్నారు. పని చేస్తున్న క్రమంలో దెబ్బలు తగిలితే మందుల కిట్లు ఏర్పాటు చేయాలని, పని చేసే ప్రదేశంలో నీడ సౌకర్యం కల్పించి, ఆటో చార్జీలు చెల్లించాలని కోరారు. మూడు నెలల నుంచి కూలి డబ్బులు రావడం లేదని, వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు కె. గంగాధర్, దేవన్న, రాజలింగం, అనంతరావు పాల్గొన్నారు.